

దేవీ నమోస్తుతే..

కొండపాక/వర్గల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా కొండపాక మండలం మర్పడగ విజయదుర్గాసమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో ప్రత్యేక పూజలు ఘనంగా కొనసాగుతున్నాయి. మూడో రోజు అమ్మవారు గాయత్రీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చింది. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రత్యేక పూజలు చేశారు. వర్గల్ విద్యాధరి క్షేత్రంలో అమ్మవారు శ్రీ అన్నపూర్ణ దేవి అలంకరణలో దర్శనమిచ్చారు.

అమ్మవారి ఆశీస్సులు ఉండాలి : కవిత

సిద్దిపేట జిల్లాలోని వర్గల్ విద్యా సరస్వతీ అమ్మవారిని దర్శించుకోవాలనే సంకల్పం నేరవేరిందని ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత పేర్కొన్నారు. బుధవారం ఆలయానికి వచ్చిన ఆమెకు నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కవితకు విద్యాధరి క్షేత్రం జ్ఞాపికను ఆలయ సిద్ధాంతి చంద్రశేఖర శర్మ అందజేసి వేద మంత్రోశ్చరణలతో ఆశీర్వచనం చేశారు.

గాయత్రీదేవిగా మర్పడగ విజయ దుర్గామాత







ఒక్కేసి పువ్వేసి.. చందమామ..

సిద్దిపేట పట్టణంలో బతుకమ్మ సంబరాలు కన్నుల పండువగా సాగుతున్నాయి. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ కడవేర్గు మంజుల, మహిళా కౌన్సిలర్లు, స్థానిక మహిళలు బతుకమ్మ ఆడారు. ఎన్‌జీవోస్ భవన్‌లో నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో మహిళా ఉద్యోగులు పాల్గొని బతుకమ్మ ఆడారు. రైతుబజార్ వద్ద జరిగిన బతుకమ్మ సంబరాల్లో మహిళా రైతులు పాల్గొన్నారు. కూరగాయలతో బతుకమ్మను పేర్చి ఆటపాటలతో అమ్మవారిని కొలిచారు.

- సిద్దిపేట కల్చరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి)



దసరా రద్దీ..

సిద్దిపేటలో ట్రాఫిక్ ఆంక్షలు

- ప్రతి ఒక్కరూ సహకరించాలి : ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్

సిద్దిపేట క్రైం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): దసరా, బతుకమ్మ పండుగల నేపథ్యంలో సిద్దిపేటలో ట్రాఫిక్ రద్దీ విపరీతంగా పెరిగింది. ముఖ్యంగా షాపింగ్ కాంప్లెక్స్‌ల వద్ద వాహనదారులకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఈ నేపథ్యంలో ప్రజల సౌకర్యార్థం పట్టణంలోని ప్రధాన రహదారులైన సుభాష్ రోడ్డు, పుష్పాంజలి ఎక్స్‌రోడ్డు ఓల్డ్‌మార్కెట్, మాంగల్య షాపింగ్ మాల్ రోడ్లలో ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

ఆటో, కార్లకు నో ఎంట్రీ..

- పాత బస్టాండ్ మెయిన్ రోడ్డు నుంచి సుభాష్ రోడ్డు వైపు కేవలం బైక్‌లను మాత్రమే అనుమతిస్తారు. ఆటోలు, కార్లకు ప్రవేశం లేదు.
- పుష్పాంజలి ఎక్స్‌రోడ్డు నుంచి సుభాష్ రోడ్డుకు వచ్చే వాహనదారులు కూడా మోటార్ సైకిళ్లపై మాత్రమే రావాలి.
- మార్కెట్ నుంచి మాంగల్య షాపింగ్ వరకు మోటార్ సైకిళ్లను అనుమతిస్తారు. ఫోర్ వీలర్స్ వాహనాలు, ఆటోలకు ప్రవేశం నిషిద్ధం.
- సంతోషిమాత ఆలయం నుంచి వచ్చే వారు మోటార్ సైకిళ్లపై మాత్రమే రావాలి.
- బురుజు నుంచి సుభాష్ రోడ్డుకు వచ్చే మార్గంలో మోటార్ సైకిళ్లను మాత్రమే అనుమతిస్తారు. రెండు వైపులా నాలుగు చక్రాల వాహనాలు, ఆటోలకు అనుమతి లేదు.
- ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు ఉదయం 10 గంటలలోపు తమ సామాన్లను దించి వెళ్లిపోవాలి. తిరిగి రాత్రి 8 గంటల తర్వాత మాత్రమే రావాలి.
- ప్రజలు, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలని సీఐ కోరారు. ప్రజల సౌకర్యార్థమే ఈ ఆంక్షలు విధించినట్లు ఆయన స్పష్టం చేశారు.

ఇందిరమ్మతో ఉపాధి

- 90 రోజుల పని దినాలు
- అదనంగా రూ.32వేల వరకు లబ్ధి
- ఇప్పటికే పనిదినాలు పూర్తయితే వచ్చే ఆర్థిక సంవత్సరంలో అవకాశం

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి అనుసంధానం చేసింది. ఇళ్ల నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలను వివిధ దశల్లో అందిస్తున్న ప్రభుత్వం లబ్ధిదారులకు అదనంగా మరో 27 వేల నుంచి రూ.32వేల వరకు లబ్ధి పొందే అవకాశం కల్పించింది. జిల్లాలోని మొదటి దశలో 4,968 ఇళ్లు మంజూరవగా, వాటిలో సుమారు 4157 పునాది స్థాయిలో, 590 గోడల స్థాయిలో, 221 పూర్తిగా నిర్మాణం పూర్తయ్యాయి. రెండవ దశలో 2,866 ఇళ్లను నిర్మిస్తున్న లబ్ధిదారులకు కూడా ఈ లబ్ధి లభించే అవకాశం ఉంది.

- దుబ్బాక, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి):



ఫైల్

జిల్లాలోని 508 గ్రామ పంచాయతీలలో ఇందిరమ్మ ఇళ్ల పనులు జరుగుతున్నాయి. మొదటి విడతలో మండలంలోని ఒక గ్రామాన్ని ఎంపిక చేసి గ్రామాలలో పనులు చేపట్టగా, మిగిలిన 491 గ్రామాలకు ఇందిరమ్మ ఇళ్లను కేటాయించి అర్హులను ఎంపిక చేశారు. ఈ గ్రామ పంచాయతీలలో ఇందిరమ్మ ఇళ్లను మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకానికి అనుసంధానం చేస్తూ మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేసింది. బుధవారం గ్రామాలకు జిల్లా అధికారులు మార్గదర్శకాలను అందించారు. ఇప్పటివరకు అధికారుల అంచనా ప్రకారం 4,500 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద లబ్ధి పొందే అవకాశం ఉంది.

మార్గదర్శకాలు ఇవే..

పునాది స్థాయి నిర్మాణం పూర్తి వరకు 40 రోజులు, పైకప్పు స్థాయి నిర్మాణం పూర్తి వరకు మొత్తం 50 రోజులు కేటాయిస్తూ మార్గదర్శకాలను విడుదల చేసింది. ఇందులో జాబ్‌కార్డు కలిగిన లబ్ధిదారులు మాత్రమే 90 రోజుల పనిదినాలకు అర్హులుగా పేర్కొంది. ఇందుకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకం కింద లబ్ధిదారుల సర్వే చేసి తుది జాబితాను తయారు చేస్తారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకం కింద అందజేసిన జాబితా ప్రకారం 90 పనిదినాలకు మహాత్మా గాంధీ ఉపాధిహామీ పథకంలో అంచనాలు తయారు చేస్తారు. తయారు చేసిన అంచనాలను మండలానికి ఒక నివేదిక తయారు చేసి సాంకేతిక, పరిపాలనా మంజూరు ద్వారా జిల్లా అధికారులకు పంపించి అనుమతుల

మిగతా 8వ పేజీలో


నర్సంపేటలో కోతకు వచ్చిన మొక్కజొన్న చేను

మొక్కజొన్న.. కోయలేమన్నా..

- వరుస వర్షాలతో రైతుల ఆందోళన

ఈ వానాకాలం రోహిణి కార్తెలో ముందస్తుగా మొక్కజొన్న సాగు చేసిన రైతులను అకాల వర్షాలు తీవ్రంగా కలవరపెడుతున్నాయి. ఈ నెల రెండో వారం నుంచే పంట కోత దశకు చేరుకున్న తరుణంలో ఏకధాటిగా కురుస్తున్న వర్షాలు రైతులను దిక్కుతోచని స్థితిలోకి నెట్టాయి. పండగ ఖర్చుల కోసం పెట్టుబడులు పెట్టి, పంట చేతికొచ్చిన ఈ సమయంలో వర్షాలు ఆటంకం కలిగిస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సాధారణంగా చేతికొచ్చిన పంటను కోసి, ఆరబెట్టి అమ్ముకుని ఆ డబ్బుతోనే రైతులు తమ రోజువారీ, పండగ ఖర్చులను వెల్లదీసుకుంటారు. అయితే, ప్రస్తుత పరిస్థితిలో మొక్కజొన్న పంటను కోసే పరిస్థితి లేకపోవడంతో భవిష్యత్తుపై వారికి భయం పట్టుకుంది. వర్షాలు ఇలానే కొనసాగితే తమ పరిస్థితి ఏంటని రైతులు మదనపడుతున్నారు.

- దౌల్తాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి)

చేర్యాలలో షరా మామూలే..

- మున్సిపాలిటీకి రూ.15 కోట్లు మంజూరు
- పోటాపోటీగా క్షీరాభిషేకాలు
- ఎమ్మెల్యే 'పల్లా' కృషితో మంజూరయ్యాయని బీఆర్ఎస్ నాయకులు
- కొమ్మూరి చొరవతో సాకారమైందని కాంగ్రెస్ నాయకులు

చేర్యాల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మున్సిపాలిటీకి రూ.15 కోట్లు నిధులు మంజూరైన సందర్భంగా ఎప్పటిలాగే బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు పోటాపోటీగా క్షీరాభిషేకాలు జరిపారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి వినతితోనే నిధులు మంజూరయ్యాయని బీఆర్ఎస్ నాయకులు స్థానిక అంగడిబజారు వద్ద ఎమ్మెల్యే ఫ్లెక్సీకి క్షీరాభిషేకం నిర్వహించారు. అదేవిధంగా, కాంగ్రెస్ నాయకులు జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి చొరవతోనే ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని పేర్కొంటూ స్థానిక పాత బస్టాండు చౌరస్తా వద్ద కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. ఎవరికి వారుగా పరస్పర ప్రకటనలు చేసుకున్నారు. ఇరు పార్టీల శ్రేణులు సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూప్‌ల్లో ఈ అంశంపై రచ్చచేయడం చర్చనీయాంశమైంది.


చేర్యాలలో కొమ్మూరి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నిధుల కేటాయింపు వివరాలు ఇలా..

పట్టణంలోని వివిధ ప్రదేశాల్లో డ్రైనేజీల నిర్మాణానికి రూ.3 కోట్లు, రైతుబజారు పక్కన నిరుపయోగంగా ఉన్న మున్సిపల్ స్థలంలో కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి రూ.1.50 కోట్లు, కల్వర్టుల నిర్మాణానికి రూ. 50 లక్షలు, సీసీ/బీటీ రోడ్లు, కాలువల నిర్మాణానికి రూ.10కోట్ల చొప్పున నిధులు మంజూరయ్యాయి. చాలా కాలంగా మున్సిపాలిటీకి ప్రభుత్వం తరఫున నిధులు మంజూరుకాకపోవడంతో పట్టణ సుందరీకరణతో పాటు అభివృద్ధి పనులు అసంపూర్తిగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో నిధులు మంజూరు కావడం పట్ల హర్షం వ్యక్తమవుతోంది.


ఎమ్మెల్యే పల్లా ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

డయల్ 100కు తక్షణ స్పందన

- సిద్దిపేట పోలీసులకు సీపీ అనురాధ సూచన

సిద్దిపేట క్రైం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): డయల్ 100కు వచ్చే ప్రతి కాల్‌కి వెంటనే స్పందించి సంఘటనా స్థలానికి చేరుకుని సమస్యను పరిష్కరించాలని సిద్దిపేట సీపీ అనురాధ పోలీసు అధికారులకు సూచించారు. సోమవారం కమిషనరేట్ కార్యాలయంలో జరిగిన సమీక్షలో ఆమె మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ విధులను సమర్థంగా నిర్వహించాలని సూచించారు. రాత్రివేళల్లో బ్లూ కోల్ట్‌ల్స్, పెట్రో కార్ సిబ్బంది నిరంతరంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ కుశాల్కర్, సిద్దిపేట ఏసీపీ రవీందర్, వన్‌టౌన్ సీఐ వాసుదేవరావు, టూటౌన్ సీఐ ఉంపేందర్ సహా పలువురు అధికారులు పాల్గొన్నారు.

సకాలంలో స్పందించిన పోలీసులు

సీపీ ఆదేశాలకు అనుగుణంగా టూ టౌన్ పోలీసులు తక్షణమే



స్పందించి ఓ వ్యక్తి ప్రాణాలను కాపాడారు. భవానీ నగర్‌లో కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన జింక సాగర్ అనే యువకుడు కత్తితో పొడుచుకునేందుకు యత్నించాడు. డయల్ 100కు కాల్ రాగానే టూటౌన్ బ్లూకోల్ట్స్ సిబ్బంది పద్మ, మధులత సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అతడి చేతిలో ఉన్న కత్తిని లాక్కుని ప్రాణాలు కాపాడారు. అయితే సాగర్ మరో కత్తితో ఛాతీపై పొడుచుకున్నాడు. అప్రమత్తమైన పోలీసులు అతడిని ఆటోలో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి ప్రాణాలకు ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు తెలిపారు. సకాలంలో స్పందించి ప్రాణాలు కాపాడిన పోలీసులను కాలనీవాసులు అభినందించారు.

అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి దరఖాస్తుల

గడువు పొడిగింపు

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉన్నత చదువుల కోసం ఆర్థిక సహాయం అందించే అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధికి దరఖాస్తుల గడువు పొడిగించారు. 2025-26 విద్యా సంవత్సరానికి గానూ ఎస్సీ విద్యార్థుల కోసం తెలంగాణ ప్రభుత్వం అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి ద్వారా ఆర్థిక సాయం అందజేస్తుందని అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిశాఖ అధికారి సీహెచ్ కవిత ప్రకటనలో తెలిపారు. 4 ఏళ్ల డిగ్రీ చదువుతున్న వారు, చదివిన వారు అమెరికా, కెనడా, న్యూజిలాండ్, సింగపూర్, సౌత్ కొరియా, జర్మనీ దేశాల్లో ఉన్నత చదువులు చదివేందుకు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



సీతాఫలం..

మహాప్రియం

- గంప కాయలకు రూ.400
- హుస్నాబాద్ నుంచి ఇతర పట్టణాలకు ఎగుమతి
- ఈసారి కాత ఉన్నా కోతుల బెడద ఎక్కువ

7

ముక్క, సుక్క లేనట్లేనా?

- అక్టోబరు 2న దసరా, గాంధీ జయంతి
- మందు, మాంసం అమ్మకాలు బంద్
- 50 ఏళ్లలో ఇలా రావడం నాలుగోసారి

సిద్దిపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : దావత్ అనగానే మాంసం, మద్యం ఉండాల్సిందే. అలాంటిది దసరా పండుగ అంటే ఆ జోష్ రెట్టింపు అవుతుంది. ఈ ఏడాది దసరా, గాంధీ జయంతి ఒకేరోజు రావడంతో మాంసం, మద్యం ప్రియులు, వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. గాంధీ జయంతి సందర్భంగా ప్రతీ ఏడాది మందు, మాంసం అమ్మకాలు బంద్ ఉంటాయి. పండుగ వేళ ముక్క, సుక్క లేకపోవడంపై జనం తర్జనభర్జన పడుతున్నారు. 50 ఏళ్లలో ఇలా దసరా, గాంధీ జయంతి ఒకే రోజు రావడం నాలుగోసారి. దసరా వచ్చిందంటే చాలు సిద్దిపేట జిల్లాలో మాంసం, మద్యం అమ్మకాలు రికార్డు స్థాయిలో జరుగుతాయి. జిల్లావ్యాప్తంగా ఆదివారం సాధారణంగానే రూ.కోటికి పైగా మాంసం విక్రయాలు జరుగుతాయి. దసరా రోజున ఇది మరింత ఎక్కువ అవుతుంది. ఒక్క ఆదివారం రోజే జిల్లావ్యాప్తంగా 3వేల పైగా మేకలు, గొర్రెలను వధించి కోటి రూపాయలకు పైగా వ్యాపారం సాగిస్తారు. సిద్దిపేటలోని మటన్ మార్కెట్‌లో 500 నుంచి 600 గొర్రెలను వధించి విక్రయిస్తారు. చికెన్ కూడా దాదాపు లక్షల క్వింటాళ్ల వరకు విక్రయిస్తారు. దసరా రోజు మద్యం అమ్మకాలు కూడా గణనీయంగా పెరుగుతాయి. దసరా రోజు దాదాపు 10వేలకు పైగా మేకలు, గొర్రెలను వధిస్తారు. మద్యం విక్రయాలు కూడా అదే స్థాయిలో ఉంటాయి. జిల్లాలో 93 వైన్స్‌లు, 15 బార్‌లు ఉన్నాయి. ఒక్కో వైన్స్‌లో దాదాపు రూ.2.50లక్షల నుంచి రూ.3లక్షలకు పైగా లిక్కర్ విక్రయిస్తారు. పండుగ రోజుల్లో సుమారు రూ.6 కోట్లకు పైగా వ్యాపారం జరుగుతుంది. ఈ ఏడాది నిషేధం ఉండటంతో ఈ ఆదాయం ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టే అవకాశం ఉంది.


సిద్దిపేటలోని మార్కెట్‌లో మాంసం విక్రయాలు (ఫైల్)

మటన్ అమ్మకాలకు అనుమతి ఇవ్వాలి



కులవృత్తి ఆధారంగానే మేకలు, గొర్రెలు వధించి విక్రయాలు జరిపి జీవనం సాగిస్తున్నాం. తెలంగాణలో అతి పెద్దపండుగ దసరా రోజున మాంసం అమ్మకాల బంద్‌ను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి.

- కిషన్, సమీకృత మటన్ మార్కెట్ సంఘం అధ్యక్షుడు, సిద్దిపేట

'ఆశా'లకు ఉద్యోగ

భద్రత కరువు

- 24 గంటలు పని కనీస వేతనం లేదు..
- సర్వేలతో సతమతం.. విడుదల కానీ లెప్రసీ సర్వే డబ్బులు
- ఆశాల పోరాటాలకు కార్మిక సంఘాల మద్దతు

7



పోక్సో కేసుల దర్యాప్తు వేగవంతం చేయండి

- నిందితులకు కఠిన శిక్షలు పడేలా కృషి చేయాలి
- మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

మెదక్ అర్బన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నమోదైన పోక్సో కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు పోలీసు అధికారులకు సూచించారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోక్సో కేసుల దర్యాప్తు, ప్రస్తుత స్థితి కేసుల్లో సాధించిన పురోగతి తదితర అంశాలపై నిర్వహించిన సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ.. బాలికలపై జరిగే శారీరక, లైగింక వేధింపుల నేరాలు అరికట్టేందుకు పోక్సో చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి, చట్టాన్ని మరింత పటిష్ఠంగా అమలు చేయాలన్నారు. అపరిష్కృతంగా ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టిసారించి, నిందితులకు శిక్షలు పడేలా కృషిచేసి.. బాధితులకు న్యాయం చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి శుభవల్లి, అదనపు ఎస్పీ మహేందర్, ఉమెన్ సేఫ్టీవింగ్ ఏసీపీ శ్రీధర్, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు


ఖేడ్‌లోని పోలీస్‌స్టేషన్‌లో మొక్క నాటి నీళ్లు పోస్తున్న ఎస్పీ పంకజ్

ప్రతీ కేసులో నాణ్యమైన విచారణ చేయాలి : ఎస్పీ పంకజ్

నారాయణఖేడ్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ కేసులో నాణ్యమైన విచారణ చేస్తూ బాధితులకు అండగా నిలవాలని ఎస్పీ పరితోష్ పంకజ్ సూచించారు. వార్షిక తనిఖీలో భాగంగా బుధవారం ఖేడ్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో మొక్క నాటి నీళ్లు పోశారు. స్టేషన్ పరిధిలోని శుభ్రత, సిబ్బంది కిట్ ఆర్టికల్స్, కేసుల్లో సీజ్ చేసిన వాహనాలు, రికార్డులను పరిశీలించారు. విచారణలో ఉన్న కేసుల వివరాలను డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విచారణలో సందేహాలు ఉంటే విచారణ సపోర్టు సెంటర్ సేవలను వినియోగించుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను బ్లాక్‌స్పాట్లుగా గుర్తించి వాహనాల వేగం అదుపునకు ర్యాంబుల్ స్ట్రిప్స్, ఇసుక డ్రమ్ములు, సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు.

ఇంటి పెరట్లో గంజాయి మొక్కల పెంపకం

- ధ్వంసం చేసిన పోలీసులు

కల్హేర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దేవునిపల్లిలో ఇంటి పెరట్లో గుట్టుచప్పుడు కాకుండా పెంచుతున్న గంజాయి మొక్కలను పోలీసులు బుధవారం ధ్వంసం చేశారు. కల్హేర్ ఎస్సై మధుసూదన్‌రెడ్డి కథనం ప్రకారం.. గ్రామంలో చిన్ననమిళ్ల మల్లేశం తన ఇంటి పెరట్లో గంజాయి మొక్కలు పెంచుతున్నట్లు సమాచారం అందడంతో ఎస్సై మధుసూదన్‌రెడ్డి తన సిబ్బందితో దాడిచేశారు. అక్కడ గంజాయి మొక్కలు ఉండగా, వ్యవసాయ, పంచాయతీ అధికారుల సమక్షంలో ధ్వంసం చేశారు. నిందితుడు మల్లేశంపై కేసు నమోదు చేశారు. సంఘటనా స్థలాన్ని కంగ్టి సీఐ వెంకట్‌రెడ్డి పరిశీలించి, గంజాయి పెంచినా.. అమ్మినా.. సేవించినా చట్ట ప్రకారం నేరమని తెలిపారు.


పట్టుబడిన గంజాయి మొక్కలతో కంగ్టి సీఐ వెంకటరెడ్డి, కల్హేర్ ఎస్సై మధుసూదన్‌రెడ్డి

200 గ్రాముల గంజాయి స్వాధీనం

హుస్నాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మహ్మదాపూర్ రోడ్డులో గంజాయి తాగుతూ, విక్రయించడానికి ప్రయత్నిస్తున్న ముగ్గురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. మరో నిందితుడు పరారీలో ఉన్నారని సీఐ శ్రీనివాస్ తెలిపారు. అరెస్ట్ అయిన వారిలో పట్టణంలోని డబుల్ బెడ్‌రూమ్ ప్రాంతానికి చెందిన చుక్క అనిల్, మదన అభినయ్, బాలాజీనగర్‌కు చెందిన బూర్ల రాకేష్‌లుండగా, కరీంనగర్‌కు చెందిన వంశీ పరారీలో ఉన్నాడని చెప్పారు. వారి నుంచి 200 గ్రాముల గంజాయితోపాటు మూడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆయన వెంట ఎస్సై లక్ష్మారెడ్డి ఉన్నారు.

నేర రహిత సమాజం కోసం ప్రజలు సహకరించాలి : డీఎస్పీ

చేగుంట సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నేరరహిత సమాజం కోసం ప్రజలు పోలీసులకు తోడ్పాటు అందించాలని డీఎస్పీ నరేందర్‌గౌడ్ పేర్కొన్నారు. బుధవారం చేగుంటలో కట్టడి ముట్టడి చేపట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మండలంలోని వివిధ కాలనీల్లో ఉదయం 5 నుంచి 7 గంటల వరకు 110 పోలీసులతో కట్టడి ముట్టడి నిర్వహించినట్లు తెలిపారు. అద్దెకు ఉంటున్న ఇతర రాష్ట్రాల వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి పత్రాలు లేకుండా ఉన్న 69 ద్విచక్ర వాహనాలను, రెండు ఆటోలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామాయంపేట, తూప్రాన్ సీఐలు వెంకట్‌రాజాగౌడ్, రంగాకృష్ణ, ఎస్సైలు చైతన్యకుమార్‌రెడ్డి, సృజన, నారాయణ, నర్సింలు, నరేష్, శివానందం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పెట్రోల్, డీజిల్‌లో కల్తీ లేదు

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గవ్వపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద ఉన్న హెచ్‌పీ పెట్రోల్ బంకులో పెట్రోల్, డీజిల్‌లో కల్తీలేదని వినియోగదారులు అపోహలు చెందవద్దని సివిల్ సప్లయ్ జిల్లా అధికారి నిత్యానందం పేర్కొన్నారు. బంకులో పెట్రోల్, డీజిల్ నీళ్ల కల్తీ ఉందని కొంతమంది వినియోగదారులు యాజమాన్యంతో ఘర్షణకు దిగారు. పెట్రోల్ కల్తీ ఉందని పత్రికల్లో ప్రచురితం కావడంతో స్పందించిన అధికారులు బుధవారం పెట్రోల్ బంకును సందర్శించి ట్యాంకర్ల నుంచి పెట్రోల్, డీజిల్‌ను సేకరించి నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. అనంతరం హెచ్‌పీ బంకుకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. తనిఖీలో అసిస్టెంట్ సివిల్ సప్లయ్ జిల్లా అధికారి ఎండీ అబ్దుల్ నిసాన్, సిబ్బంది ఉన్నారు.

బస్సులో బ్యాగ్ మరిచిపోయిన ప్రయాణికురాలు

- బ్యాగ్‌లో రూ.1.80 లక్షల బంగారు వస్తువులు
- డీఎం సమక్షంలో ప్రయాణికురాలికి అందజేత
- తిరుపతి నుంచి వస్తుండగా ఘటన


ప్రయాణికురాలికి బ్యాగ్‌ను అందజేస్తున్న డీఎం ఉపేందర్, సిబ్బంది

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి నుంచి తిరుగుపయనమైన ఓ ప్రయాణికురాలు ఆర్టీసీ బస్సులో హ్యాండ్‌బ్యాగ్ మర్చిపోయింది. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ సమీపంలోని చిట్కుల్‌కు చెందిన కోన సత్యరమ్య తిరుపతి వెళ్లి వస్తూ ఈ నెల 15న చిట్కుల్‌లో దిగిపోయింది. బస్సులోనే బ్యాగు మరిచిపోవడంతో డ్రైవర్ గోపాల్ బస్సును డిపో అధికారులకు అప్పగించాడు. బస్సు బుక్ చేసుకునే సందర్భంగా ఇచ్చిన సెల్‌ఫోన్ నంబరు ఆధారంగా సత్యరమ్యకు ఫోన్‌చేసి సమాచారమందించారు. బ్యాగులో రూ.1.80 లక్షల విలువైన బంగారు వస్తువులు ఉన్నట్టు ఆర్టీసీ అధికారులు గుర్తించారు. ఈ మేరకు సంగారెడ్డి డిపో మేనేజర్ ఉపేందర్ సమక్షంలో బుధవారం ప్రయాణికురాలు, కుటుంబసభ్యులను పిలిపించి బంగారు వస్తువులతో కూడిన హ్యాండ్ బ్యాగ్‌ను అప్పగించారు. దీంతో ప్రయాణికురాలు ఆర్టీసీ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

ఎరాన్ పరిశ్రమలో కెమికల్ లీకేజీ

- నలుగురు కార్మికులకు గాయాలు


గాయపడ్డ కార్మికులతో మాట్లాడుతున్న సీఐటీయూ నేత

సదాశివపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని ఎరాన్ లైఫ్‌సైన్స్ పరిశ్రమలో బుధవారం రసాయనాలు లీకై నలుగురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని పరిశ్రమ యాజమాన్యం చికిత్స నిమిత్తం సంగారెడ్డిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులు శివారెడ్డి, శ్రీనివాస్, దివాకర్, సింహాచలంలను సంగారెడ్డి జిల్లా సీఐటీయూ ఉపాధ్యక్షులు అతిమేల మాణిక్ పరామర్శించారు. పరిశ్రమ యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే ప్రమాదం సంభవించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గాయాల పాలైన కార్మికులకు పరిశ్రమ యాజమాన్యం కార్పోరేట్ వైద్యం అందించాలని, కార్మికుల కుటుంబాలకు అండగా నిలవాలని ఆయన డిమాండ్ చేశారు.

విద్యుదాఘాతంలో కాంక్రీట్ మిక్సింగ్ టిప్పర్ దగ్ధం

రామాయంపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రామాయంపేట పాత హైవేపై బుధవారం కరెంటు మెయిన్ లైన్లు తగిలి కాంక్రీట్ మిక్సింగ్ టిప్పర్ దగ్ధమైంది. పాత హైవేపై నుంచి టిప్పర్ వెళ్తుండగా, ఈ ఘటన జరిగింది. విషయం తెలుసుకున్న ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. టిప్పర్ డ్రైవర్ వెంటనే అప్రమత్తమై ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. సీసీరోడ్డు నిర్మాణ పనుల కోసం కాంక్రీట్ మిక్సింగ్ తరలించే ప్రయత్నంలో ప్రమాదం చోటుచేసుకుంది.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

జహీరాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దిడిగి గ్రామంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేశారు. జహీరాబాద్ రూరల్ ఎస్సై కాశీనాథ్ కథనం ప్రకారం.. దిగిడి గ్రామ శివారు ఓ చెట్టు కింద కొందరు పేకాట ఆడుతున్నట్లు సమాచారం వచ్చింది.దీంతో ఆయన వెళ్లి దాడిచేసి, ఆరుగురిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ. 17,620నగదు, ఆరు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

చెరువులో పడి వృద్ధురాలు మృతి


కోల్లోల్లి చంద్రమ్మ(ఫైల్)

ములుగు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి). చెరువులో పడి వృద్ధురాలు మృతిచెందిన సంఘటన మండల కేంద్రమైన ములుగులో చోటుచేసుకుంది. ములుగుకు చెందిన కోల్లెల్లి చంద్రమ్మ(70) నాలుగురోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుటుంబసభ్యులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు. కాగా బుధవారం మధ్యాహ్నం గ్రామంలోని కుడి గుంటలో చంద్రమ్మ శవమై కనిపించింది. కుటుంబసభ్యులు చూసి పోలీసులకు తెలిపారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గజ్వేల్ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళ అదృశ్యం


సవిత(ఫైల్)

జహీరాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనేగుంట గ్రామానికి చెందిన ఓ మహిళ కనిపించకుండా పోయింది. జహీరాబాద్ రూరల్ ఎస్సై కాశీనాథ్ కథనం ప్రకారం.. గ్రామనికి చెందిన ప్యాలారం సవిత(22) ఈ నెల 23న ఇంటి నుంచి వెళ్లింది. బుధవారం కూడా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువులు, ఇరుగుపొరుగు వారి వద్ద వెతికారు. అయినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. తండ్రి అంజయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. సవిత ఆచూకీ తెలిస్తే 87126 61847 నెంబరు కు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలని ఎస్సై తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో జింక మృతి


గురుసింగ్‌తండా శివారులో మృతిచెందిన జింక

నారాయణఖేడ్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నాగల్‌గిద్ద మండల పరిధిలోని గురుసింగ్‌తండా శివారులో ఓ జింక అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఖేడ్ అటవీశాఖ రేంజ్ అధికారి అనురాధ బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. తండా శివారులోని నీటి కుంట సమీపంలో ఓ జింక మృతిచెంది పడి ఉండటాన్ని గుర్తించిన స్థానికులు తమకు సమాచారం అందించారన్నారు. బీట్ అధికారులు ధన్‌సింగ్, వరప్రసాద్ అక్కడికి చేరుకుని జింకను పరిశీలించారు. ఈ జింక మృతిచెందిన ఐదురోజులు కావస్తున్నదని, పాముకాటు వల్ల మృతిచెందినట్టు భావిస్తున్నామని అనురాధ వివరించారు.

బైక్ కవర్ నుంచి రూ. లక్ష మాయం

- వారాంతపు సంతలో ఘటన


సీసీటీవీ ఫుటేజీలో బైక్‌పై వెళ్తున్న అగంతకులు

చేర్యాల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో బుధవారం జరిగిన వారాంతపు సంతలో బైక్ కవర్‌లో దాచిన నగదు చోరీ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఆకునూరు గ్రామానికి చెందిన ఓ రైతు దంపతులు బ్యాంకు నుంచి రూ. లక్ష విత్ డ్రా చేసుకుని, రెండు బండిల్స్‌గా (ఒక్కొక్కటి రూ. 50 వేలు) బైక్ ముందు కవర్‌లో పెట్టారు. ఇంటికి వెళ్తున్న క్రమంలో సంతలో కూరగాయలు కొనుగోలు చేసేందుకు ఆగారు. అయితే, వీరి బైక్ కవర్‌లో నుంచి ఓ బండిల్‌ను దుండగులు అపహరించారు. అందులో రూ. 49వేలు ఉన్నాయి. ఇంటికి వెళ్లిన తర్వాత గమనించిన దంపతులు పోలీసులను ఆశ్రయించారు. అయితే, దొంగలు బ్యాంకు నుంచే వీరిని అనుసరించి ఉంటారా? లేక సంత దగ్గర సందడిలో చోరీ చేశారా అన్నది తేలాల్సి ఉంది. ఇక.. వారాంతపు సంతకు వేలాదిమంది తరలివస్తుండటంతో రద్దీగా ఉంటుంది. గతంలో సెల్‌ఫోన్లు చోరీకి గురయ్యాయి. ప్రస్తుతం నగదు అపహరణ చోటుచేసుకోవడంతో వారాంతపు సంతలో గస్తీ పెంచాలని పట్టణవాసులు కోరుతున్నారు.

గుమ్మడిదలలో దొంగల హల్‌చల్

- నిన్న ఐదు తులాలు పుస్తెలతాడు చోరీ
- నేడు పట్ట పగలే సహకార సొసైటీ ఆఫీసులో చోరీ
- రూ. 50 వేల విలువైన ల్యాప్ ట్యాబ్ అపహరణ


దొంగలు చోరీకి పాల్పడిన సహకార సొసైటీ సంఘం గుమ్మడిదల

గుమ్మడిదల, సెప్టెంబరు (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. రోజుకోచోట చోరీలు చేస్తున్నారు. మంగళవారం పట్టపగలు రాధమ్మ అనే మహిళ మెడలోంచి ఐదు తులాల పుస్తెలతాడు లాక్కొని వెళ్లగా, బుధవారం పట్టపగలే సహకార సొసైటీ కార్యాలయంలో చోరీకి పాల్పడటం కలకలం రేపింది. మండల కేంద్రంలోని సహకార సొసైటీ సిబ్బంది బుధవారం మధ్యాహ్నం కార్యాలయానికి తాళం వేసి సొసైటీ బ్యాంకునకు వెళ్లారు. ఈ క్రమంలో దుండగులు వెనుక తలుపు పగులగొట్టి, లోనికి చొరబడి రూ.50 వేల విలువైన ల్యాప్‌ట్యాప్‌ను ఎత్తుకెళ్లారు. సిబ్బంది ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మూడురోజుల క్రితం ఓ కాంగ్రెస్ నాయకుడి కార్యాలయంలోనూ దొంగలు ప్రవేశించినట్లు అక్కడి సీసీ కెమెరాల్లో రికార్డు అయింది. కార్యాలయంలో విలువైన వస్తువులు దొరక్కపోవడంతో గదిలోని వస్తువులను పగులగొట్టి, చెల్లాచెదురు చేశారు. పోలీసుల నిర్లక్ష్యం కారణంగానే వరుస దొంగతనాలు జరుగుతున్నాయని, భద్రత పెంచాలని స్థానికులు కోరుతున్నారు.



ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

వచ్చేనెల 16 నుంచి పటాన్‌చెరులో రాష్ట్రస్థాయి క్రీడలు

పటాన్‌చెరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి ఆటలపోటీలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం పటాన్‌చెరు క్యాంపు కార్యాలయంలో ఎస్జీఎఫ్ అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. వచ్చే నెల 16,17,18 తేదీల్లో 69వ ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలను పటాన్‌చెరు కేంద్రంగా నిర్వహించనున్నామని తెలిపారు. ఇందుకు సంబంధించిన అన్ని రకాల ఏర్పాట్లు చేయాలన్నారు. అండర్-17 విభాగంలో వాలీబాల్, అండర్-14 విభాగంలో కబడ్డీ పోటీలు ఉంటాయని తెలిపారు. 33 జిల్లాల నుంచి 420 మంది క్రీడాకారులు, వందమంది వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొంటారన్నారు. వీరందరికీ మూడురోజులపాటు సొంత నిధులతో భోజనం, వసతి, విజేతలకు బహుమతుల ఇస్తున్నామన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో నిలిచిన విజేతలను సొంత ఖర్చులతో జాతీయస్థాయి పోటీలకు పంపుతామని చెప్పారు.







గజ్వేల్ :అర్ధనారీశ్వర అవతారంలో దర్శనమిస్తున్న సంతోషిమాత అమ్మవారు, ఝరాసంగం : దుర్గామాత పూజలో నాయకులు, భక్తులు, చేర్యాల: అన్నపూర్ణ దేవి అలంకరణలో దుర్గాదేవి

అర్ధనారీశ్వర అవతారంలో..

గజ్వేల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : అర్ధనారీశ్వర అవతారంలో గజ్వేల్ పట్టణంలోని శ్రీ సంతోషిమాత అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చింది. గజ్వేల్‌లోని సంతోషిమాత ఆలయంలో పూజారి దేశపతి రాజశేఖరశర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

అన్నపూర్ణదేవిగా దుర్గాదేవి..

ఝరాసంగం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కేతకీ సంగమేశ్వరస్వామి ఆలయంలో బుధవారం దుర్గదేవి అన్నపూర్ణదేవిగా భక్తులకు దర్శనమిచ్చింది. ఆలయ అర్చకులు వేదమంత్రోశ్చరణల మధ్య ప్రత్యేక పూజలు, ఆలయ మండపంలో హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హనుంత రావుపాటిల్, ఆలయ చైర్మన్ చంద్రశేఖర్, ఆలయ ధర్మకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గమ్మకు విశేష పూజలు..

చేర్యాల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా దుర్గాదేవి అన్నపూర్ణ దేవిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా వాసవీనగర్, అయ్యప్పస్వామి ఆలయాల్లో విశేష పూజలు చేశారు. చావడి వద్ద దుర్గాదేవికి బోనాలు సమర్పించి బెల్లంపాయసం నివేదించారు.



హుస్నాబాద్‌లో సీతాఫలాల విక్రయాలు

సీతాఫలం.. మహాప్రియం

గంప కాయలకు రూ.400

- హుస్నాబాద్ నుంచి ఇతర పట్టణాలకు ఎగుమతి
- ఈసారికాతఅత ఉన్నా కోతుల బెడద ఎక్కువ

హుస్నాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : అందరికి ప్రియమైన సీతాఫలం మహా ప్రియం అయ్యింది. అధిక విటమిన్లు ఉండే సీతాఫలాలకు ప్రస్తుతం భలే డిమాండ్ ఏర్పడింది. గుట్టలు, కంచెలు ఎక్కువగా ఉన్న మెట్టప్రాంతమైన హుస్నాబాద్‌లో ఈ ఫలాలు ఎక్కువ కాస్తాయి. వీటితో ఈ రెండునెలలు ఈ ప్రాంతవాసులకు ఉపాధి దొరుకుతుంది. గతంలో గ్రామీణ ప్రాంతాల్లోనే వీటిని విక్రయించే వారు. కానీ ప్రస్తుతం పట్టణాలకే ఎగుమతి చేస్తున్నారు. దళారులు రైతుల నుంచి కొనుగోలు చేసి హైదరాబాద్, హన్మకొండ, కరీంనగర్ వంటి ఇతర పట్టణాలకు ఎగుమతి చేస్తున్నారు. దీంతో వీటి ధరలు పెరిగిపోయాయి. ఈసారి సమయానుకూలంగా వర్షాలు పడటంతో కాత బాగానే ఉన్నా కోతులు కాయలు చిన్న సైజులో ఉన్నప్పుడే తెంపివేస్తున్నాయని రైతులు పేర్కొంటున్నారు. కోతుల బెడదతో చిన్న సైజులోనే తెంపాల్సి వస్తున్నదని పేర్కొంటున్నారు. పక్షంరోజుల నుంచి వీటి విక్రయాలు జోరందుకున్నాయి. ప్రస్తుతం తెల్లవారుజామునే సీతాఫలాల గంపలతో హుస్నాబాద్ ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతం నిండిపోతుంది. ఇక్కడి నుంచి ట్రాలీ ఆటోల్లో వివిధ పట్టణాలకు ఎగుమతి చేస్తున్నారు. మేము పొద్దంతా కష్టపడి తీసుకొస్తే గిట్టుబాటు కావడం లేదని, దళారులు తమ వద్ద తీసుకొని ఎక్కువ ధరలకు పట్టణాలకు ఎగుమతి చేస్తున్నారని పేర్కొంటున్నారు.

వంద కాయలకు రూ.750 పైనే..

హుస్నాబాద్‌లో వంద సీతాఫలాల కాయలకు రూ.750 పైగా విక్రయిస్తున్నారు. మరి పెద్ద సైజు కాయలకు రూ.800లకు పైగా అమ్ముతున్నారు. గంపకు రూ.300 నుంచి రూ.350 వరకు విక్రయిస్తున్నారు. గంపలో 40 నుంచి 50 వరకు మాత్రమే ఉంటున్నాయి. మరి కొద్దిరోజుల తరువాత వీటి ధరలు మరింత పెరిగే అవకాశాలున్నాయని పేర్కొంటున్నారు.

హుస్నాబాద్ నుంచి వివిధ పట్టణాలకు..

హుస్నాబాద్ నుంచి వివిధ పట్టణాలకు సీతాఫలాలు ఎగుమతి అవుతున్నాయి. అక్కన్నపేట మండలంలోని గండిపల్లి, కుందనవానిపల్లి, ధర్మారం, నందారం, తెనుగుపల్లి, మల్‌చెర్వుతండా, రేగొండ, గుబ్బడి, కోహెడ మండల బస్వాపూర్, నాగసముద్రాల గ్రామాల నుంచి హుస్నాబాద్‌కు తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. ప్రతిరోజు తెల్లవారుజామున వీటి కొనుగోళ్లతో హుస్నాబాద్ బస్టాండ్ కిటకిటలాడుతుంది. హుస్నాబాద్ నుంచి హైదరాబాద్, కరీంనగర్, వరంగల్, సిద్దిపేట, హుజూరాబాద్ పట్టణాలకు ట్రాలీ ఆటోల ద్వారా ఎగుమతి చేస్తున్నారు.



సీతాఫలాలు

కోతుల బెడద ఎక్కువ



ఈసారి వర్షాలు మంచిగా పడి చెట్లకు కాయలు కాసినప్పటికీ కోతులతో లాభం లేకుండా పోతుంది. చిన్నగా ఉన్నప్పుడే తెంపి వేస్తున్నాయి. అందుకే చిన్న సైజులో ఉన్నప్పుడే తెంపి తీసుకొస్తున్నాం. పొద్దంతా కష్టపడితే కూలి గిట్టుబాటు అవుతుంది. రోజు రెండు, మూడు గంపలు తీసుకొస్తున్నాం. ముందు ముందు ఇంకా ధరలు పెరుగుతయి.

\- గుగులోతు సత్తవ్వ, కొండాపూర్

ఈ నెలరోజులు కూలి దొరికినట్లే..



సీతాఫలాలు కాసే ఈ నెలరోజులు మాకు కూలి దొరికినట్లే. రోజు రూ.500 నుంచి రూ.700 వరకు వస్తాయి. కాయలు పెద్దగా రాకపోవడంతో ఒక్కోసారి తక్కువ ధరకే అమ్ముతున్నం. ముఖ్యంగా కోతులతోనే కాయలు దొరకడం లేదు. మేము హుస్నాబాద్‌కు తీసుకొచ్చి అమ్మితే మధ్యలోల్లు కరీంనగర్, హన్మకొండ, హుజూరాబాద్ పంపిస్తున్నరు.

\- మేడబోయిన లసుమయ్య, గుబ్బడి

కేటీఆర్ ఇచ్చే జీతాలు తీసుకుని మాట్లాడుతున్నారు

● యూట్యూబ్ చానళ్లపై ఎంపీ రఘునందన్ ఘాటు వ్యాఖ్యలు



తూప్రాన్ ఆస్పత్రి ఆవరణలో మొక్క నాటుతున్న ఎంపీ

తూప్రాన్/రామాయంపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): 'మా యూట్యూబ్ మిత్రులకు బాగా ఆవేశం వస్తుంది. రఘునందన్‌రావుకు కాంగ్రెస్‌తో సంబంధాలు అంటగడుతున్నారు. కేటీఆర్ వద్ద జీతం తీసుకుంటున్న కొందరు సెల్‌ఫోన్ మిత్రులు బాగా మాట్లాడుతున్నారు. కేటీఆర్ ఇచ్చే జీతాలకు మాట్లాడే...' అంటూ మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ఘాటు వ్యాఖ్యలు చేశారు. మెదక్ జిల్లా తూప్రాన్ ఆస్పత్రి ఆవరణలో ఏక్ పేడ్ మాకే నామ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం సాయంత్రం ఆయన ఆస్పత్రి ఆవరణలో మొక్కనాటారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రఘునందన్ కాంగ్రెస్ వాళ్లని తిట్టాలి కదా అంటూ మా యూట్యూబ్ మిత్రులకు బాగా ఆవేశం వస్తుందని ఈ వ్యాఖ్యలు చేశారు. బంగారు తెలంగాణ చేశామని బీఆర్ఎస్ వాళ్లు చెబుతారని, పదేళ్లలో కేసీఆర్ సొంత జిల్లా తూప్రాన్‌లో ఒక్క డిగ్రీ కళాశాల కూడా పెట్టలేని గొప్పనాయకుడన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు హరీశ్‌రావు శాసనసభలో ఆంధ్రలో డిగ్రీ కళాశాలలు ఎక్కువని, తెలంగాణలో తక్కువని మాట్లాడేవారని, కేసీఆర్ పదేళ్లలో తూప్రాన్‌లో డిగ్రీ కళాశాల ఎందుకు పెట్టలేదో సూటిగా సమాధానం చెప్పాలని అన్నారు. కేసీఆర్ సొంత జిల్లాలో డ్రాపవుట్లు అవుతున్నారని గ్రౌండ్ రిపోర్ట్ వచ్చిందని, దీనికి మీ కేటీఆర్.. మీ యూట్యూబ్ యాంకర్లు తీసుకునే జీతాలతో కాలేజీ పెడితే బాగుంటుందన్నారు. రఘునందన్‌రావును విమర్శించడానికి చాలా టైం ఉందని, రమ్మంటే టీవీ చానెల్‌కు వస్తానన్నారు. కాంగ్రెస్ సక్కదనం 20 నెలలు గడిచిపోయిందని, తూప్రాన్‌లో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలన్నారు. ఆయన వెంట సిద్దిపేట, మెదక్ జిల్లాల బీజేపీ అధ్యక్షులు బైరి శంకర్, మల్లేశ్‌గౌడ్, నత్తి మల్లేశ్ ముదిరాజ్, జానకీరాంగౌడ్, సాయిబాబాగౌడ్, సంఖ్య యాదగిరి, దుర్గరాజ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. జిల్లాలోని రామాయంపేట పట్టణ ప్రజలకు, వ్యాపారులకు ఎంపీ రఘునందన్ బుధవారం జీఎస్టీపై అవగాహన కల్పించారు. అంతకు ముందు ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన ఉచిత ఆరోగ్య శిబిరంలో పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరుడిని బ్రహ్మోత్సవం



గరుడవాహనంలో వేంకటేశ్వరస్వామిని ఊరేగిస్తున్న భక్తులు

గుమ్మడిదల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : గుమ్మడిదలలో కల్యాణ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు వైభంగా కొనసాగుతున్నాయి. బుధవారం ఆలయ కమిటీ చైర్మన్ ముద్దుల బాల్‌రెడ్డి, పాలకవర్గ సభ్యులు, గ్రామపెద్దలు, వంశపార ధర్మకర్తల ఆధ్వర్యంలో ఆలయంలో ఘనంగా ధ్వజారోహణం నిర్వహించారు. రెండోరోజు సైతం భక్తులతో ఆలయం కిటకిటలాడింది. శ్రీదేవి, భూదేవి సహిత కల్యాణ వేంకటేశ్వరస్వామి అర్చకులు ప్రత్యేక పూజలు, నైవేద్యాలు సమర్పించారు. అనంతరం స్వామివారికి శాస్త్రోక్తంగా గరుడవాహన సేవ నిర్వహించారు. గ్రామంలోని వీధుల గుండా ఊరేగుతున్న స్వామివారికి భక్తులు పూజలు చేశారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా రోజువారీగా భిన్న రకాల వాహన సేవలు, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ పాలకవర్గం ప్రకటించింది. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల విష్ణువర్ధన్‌రెడ్డి, ఆలయ కమిటీ మాజీ చైర్మన్లు ఇందేల బాల్‌రెడ్డి, పడమటి లక్ష్మారెడ్డి, మాజీ సర్పంచ్ తులసీదాస్, పుట్ట నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సింగూరు ప్రాజెక్టును సందర్శించిన జీఆర్‌ఎంబీ చైర్మన్

● రివిట్‌మెంట్ కుంగిన ప్రాంతం పరిశీలన



సింగూరు ప్రాజెక్టును సందర్శిస్తున్న జీఆర్‌ఎంబీ చైర్మన్ పాండ్య, బోర్డు సభ్యులు

పుల్‌కల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలోని సింగూరు ప్రాజెక్టును గోదావరి నది యాజమాన్య సంస్థ(జీఆర్‌ఎంబీ) చైర్మన్ బీపీ.పాండ్య సందర్శించారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా బుధవారం పవర్ బోర్డు సభ్యుడు ఆర్ఎం.రంగరాజన్‌తో కలిసి ప్రాజెక్టు వద్దకు చేరుకుని స్థానిక ఇంజనీర్లతో మాట్లాడారు. రాష్ట్ర డ్యాం సేఫ్టీ అథారిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా ప్రాజెక్టు గేట్లు, ఆనకట్టను, జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని పరిశీలించారు. ఎగువన కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి వస్తున్న వరద ప్రవాహానికి ప్రాజెక్టు ఏడు గేట్లు ఎత్తడంతో వరద జలాలు దిగువకు పారుతుండగా తిలకించారు. ప్రాజెక్టుపై కలియతిరుగుతూ ప్రస్తుత నీటి మట్టం, ఎగువ నుంచి వస్తున్న వరద జలాల వివరాలను ఈఈ భీమ్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టుకు ఎడమ వైపున అంతర్భాగంలో ఆనకట్ట రివిట్‌మెంట్ కుంగిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఆనకట్టకు ప్రమాదం పొంచి ఉండటంతో స్థానిక ఇంజినీర్లు ముందస్తు జాగ్రత్త చర్యగా కంకర చిప్స్, ఇసుక బస్తాలను పేర్చడంతో పాటుగా ఇతరత్ర భద్రత చర్యలు తీసుకుంటుండటంతో వారిని అభినందించారు. ప్రాజెక్టును పరిసర ప్రాంతాన్ని ఎప్పటికప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పిచ్చి చెట్లు, మొక్కలు, గడ్డి మొలవకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఇంజనీర్లు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు ఎస్ఈ పోచమల్లు, ఈఈ భీమ్, డీఈఈ నాగరాజు, ఏఈఈలు మహిపాల్‌రెడ్డి, శాలిని, స్టాలిన్, సిబ్బంది మన్నె నారాయణ, రమేశ్ పాల్గొన్నారు.

నేడు లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో గిరి ప్రదక్షిణ

- వేడుకలు ప్రారంభించనున్న మాధవానంద సరస్వతీ స్వామి
- తరలిరానున్న వేలాది మంది భక్తులు



నాచగిరి క్షేత్రంలో లక్ష్మీనృసింహస్వామి ఆలయ ప్రధాన ద్వారం

వర్గల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : వర్గల్ మండలం నాచారం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో గురువారం స్వామివారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం పురస్కరించుకుని నాచగిరి వద్ద గిరి ప్రదక్షిణను తొగుట రాంపురం పీఠాధిపతులు మాధవానంద సరస్వతీ స్వామిజీ ప్రారంభించనున్నారు. ఇందుకు కావాల్సిన ఏర్పాట్లు ఘనంగా చేశారు. నాచగిరి క్షేత్రం చుట్టూ సుమారు రెండు కిలోమీటర్లు గిరి ప్రదక్షిణ ఉంటుంది. ఆలయం వద్ద ఉదయం 7.30 గంటలకు స్వామిజీ గిరి ప్రదక్షిణను ప్రారంభిస్తారని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పల్లెర్ల రవీందర్‌గుప్తా తెలిపారు. వేడుకలకు వేలాది మంది తరలిరానున్న నేపథ్యంలో ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తెలిపారు. ఆలయ కార్యనిర్వహణాధికారి విజయ రామారావు పర్యవేక్షణలో గిరి ప్రదక్షిణ నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

విద్యార్థుల వసతి ఎక్కడ..?

- షురూ కాని తాత్కాలిక షెడ్లు
- తాత్కాలిక భవనంలోనా.. స్కూల్‌లోనేనా?
- హాస్టల్ కూలడంతో బసకు అవస్థలు



హాస్టల్ భవనం కూల్చివేయడంతో ఖాళీగా దర్శనమిస్తున్న దృశ్యం

మునిపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం లింగంపల్లి గురుకుల హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరి ఈనెల 9న కూలిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో ముగ్గురు విద్యార్థులకు స్వల్పగాయాలయ్యాయి. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఈవో వెంకటేశ్వర్లు, గురుకులాల కార్యదర్శి రమణకుమార్ తదితరులు సందర్శించి పురాతన భవనాలను కూల్చివేసి తాత్కాలిక రేకుల షెడ్లు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించిన విషయం తెలిసిందే. సంఘటన జరిగిన రోజే 7వ తరగతికి చెందిన విద్యార్థులతోపాటు మరి కొంతమంది విద్యార్థులను వారి తల్లిదండ్రులు ఇళ్లకు తీసుకెళ్లారు. 22 నుంచి దసరా సెలవులు రావడంతో మిగతా విద్యార్థులంతా ఇళ్లకు వెళ్లిపోయారు. అయితే సంఘటన జరిగి 15 రోజులవుతున్నా తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేయించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. లింగంపల్లి గురుకుల సొసైటీలో మొత్తం 640 మంది విద్యార్థులు ఉన్నారు. ఇందులో అన్ని తరగతులకు సంబంధించి పురాతన హాస్టల్, స్కూల్ భవనాలు ఉన్నాయి. కానీ ఇటీవల హాస్టల్ భవనం కూలడంతో 7, 8,9, 10వ తరగతులకు సంబంధించి మొత్తం 320 మంది విద్యార్థులకు వసతి సౌకర్యం లేకపోవడంతో స్కూల్ భవనంపై ఉన్న రేకుల షెడ్డులోనే తలదాచుకుంటూ నరకయాతన అనుభవించారు. ఆ షెడ్డు సైతం వర్షానికి కురుస్తుండడంతో వారంరోజుల పాటు విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ గడిపారు. మిగతా 5, 6వ తరగతితో పాటు ఇంటర్ విద్యార్థులకు హాస్టల్ భవనం ఉంది. దసరా సెలవులు కావడంతో అందరూ ఊళ్లకు వెళ్లిపోయారు. సెలవులు ముగిసేవరకైనా రేకుల షెడ్లు నిర్మిస్తారో లేదో వేచిచూద్దాం.

'ఆశా'లకు ఉద్యోగ భద్రత కరువు

- 24 గంటలు పని.. కనీస వేతనం లేదు..
- సర్వేలతో సతమతం.. విడుదల కానీ లెప్రసీ సర్వే డబ్బులు
- ఆశాల పోరాటాలకు కార్మిక సంఘాల మద్దతు



నిరసన తెలుపుతున్న ఆశావర్కర్స్(ఫైల్)

సిద్దిపేట అర్బన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : గ్రామస్థాయిలో ఆరోగ్య సర్వేలు నిర్వహిస్తూ, ఆరోగ్య సమస్యలను తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తూ.. గర్భిణులకు, బాలింతలకు తగిన సలహాలు, సూచనలు చేసే ఆశావర్కర్స్‌కు ఉద్యోగ భద్రత కరువైంది. ఆరోగ్య సర్వేతో పాటు ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సర్వేల్లో భాగస్వామ్యులను చేయడంతో పనిభారం పెరుగుతోందని ఆశాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. న్యాయపరమైన డిమాండ్లను నెరవేర్చాలని ప్రభుత్వం చెప్పిన విధంగా ఆశాల సమస్యలను మేనిఫెస్టోలో పెట్టాలని కొంతకాలంగా ఆశావర్కర్లు నిరసనలను తెలుపుతూనే ఉన్నారు. సిద్దిపేట జిల్లావ్యాప్తంగా సుమారు 980 పైచిలుకు ఆశావర్కర్లు పనిచేస్తున్నారు.

మూడేళ్లుగా విడుదల కాని లెప్రసీ డబ్బులు

ఆశావర్కర్లతో లెప్రసీకి సంబంధించిన సర్వే గత, ప్రస్తుత ప్రభుత్వ హయాంలో కొనసాగింది. సంవత్సరానికి 14 రోజులపాటు లెప్రసీ సర్వే కొనసాగుతుంది. ఇందులో పాల్గొన్న ఆశావర్కర్‌కు 14 రోజులకు రూ.700 వేతనం ఇస్తారు. జిల్లావ్యాప్తంగా మూడేళ్లుగా లెప్రసీ సర్వే డబ్బులు పెండింగ్‌లో ఉన్నాయని ఆశావర్కర్స్ ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రతి నెల ఒకటవ తేదీలోపే జీతం డబ్బులు పడేదని, ప్రస్తుత ప్రభుత్వంలో నెల గడిచిన తర్వాత 15, 20 రోజుల వరకు జీతాలు ఆలస్యంగా వస్తున్నాయని ఆశాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జీతం రావాలంటే కేసులు తప్పనిసరి

ఆశావర్కర్స్‌కు ప్రతీనెల రూ.9,500 వేతనాన్ని ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తోంది. ఈ వేతనం సరిగ్గా రావాలి అంటే ఒక్కో ఆశావర్కర్ ప్రతి నెల ఒక్క డెలివరీ కేసు, ఒక్క గర్భవతి కేసు నమోదు చేయాల్సి ఉంటుంది. అలా నమోదు చేయకపోతే జీతం రావడం కొంత ఇబ్బందికరంగా మారుతూ ఉందని ఆశాలు అంటున్నారు. 24 గంటలు పనిచేస్తున్న తమకు కనీసం సెలవు దినాలు కూడా లేవని, కనీస వేతనం ఇవ్వడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైతోందని కార్మిక సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

డిమాండ్లు ఇవే..

ఆశావర్కర్స్‌కు ఫిక్స్ వేతనం రూ.26 వేలు చెల్లించాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి. ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి. ఆదివారం సెలవు దినాన్ని ప్రకటించాలి. సర్వే చేస్తున్న సందర్భంలో అనారోగ్యం పాలైన వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి. సర్వే డబ్బులను పూర్తిస్థాయిలో చెల్లించాలి. మేనిఫెస్టోలో ఆశా వర్కర్ల సమస్యలను చేర్చాలి న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలి.

సర్వేకు వెళ్లినప్పుడు ఇబ్బందులు ఎదురవుతున్నాయి



ఆశావర్కర్లుగా ఫీవర్, టిబి, ఫైలేరియా, లెప్రసీవ్ అంటే సర్వేలను గ్రామస్థాయిలో నిర్వహిస్తున్నాం. సర్వేకు వెళ్లినప్పుడు కొన్ని రకాల అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. అలాంటి సందర్భంలో ప్రభుత్వం ఆశావర్కర్స్‌ను ఆదుకోవాలి. వారికి ఉద్యోగ భద్రత, ఇన్సూరెన్స్ సౌకర్యం ఏర్పాటు చేయాలి. ఆశావర్కర్స్ సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు నిరసనలను కొనసాగిస్తాం.

\- ప్రవీణ, ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి

ఆశావర్కర్స్‌కు అండగా ఉంటాం



ఆశావర్కర్స్ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చి వారికి కనీస వేతనం అందించాలి. వారు చేసే న్యాయమైన పోరాటానికి సీఐటీయూ అండగా ఉంటుంది. భవిష్యత్‌లో ఆశావర్కర్స్ సమస్యలను పరిష్కరించకపోతే సమరశీల పోరాటాలకు సిద్ధమవుతాం..

\- రవికుమార్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు

కోతులను పట్టించిన గ్రామస్థులు

కొమురవెల్లి, సెప్టెంబరు24 (ఆంధ్రజ్యోతి): గ్రామస్తులందరు కలిసి కోతులను వాటిని పట్టుకునేవారికి పట్టించారు. మండలంలోని గురువన్నపేట గ్రామస్తులు కోతుల ద్వారా ఎదురవుతున్న నానా ఇబ్బందులను పరిష్కరించడానికి బుధవారం తలాకొంత డబ్బులు పోగుచేసి కోతులను పట్టేవారిని పిలిపించి కోతులను పట్టించారు. ఎవరో వచ్చి ఏదో చేస్తారు అని వేచి చూడకుండా గ్రామస్తులందరూ ఏకమై గ్రామంలోని సమస్య పరిష్కారానికి పూనుకున్నారు. ఐక్యమత్యంతో గ్రామంలో సమస్యల పరిష్కారాలకు కృషిచేస్తున్న గురువన్నపేట గ్రామం ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తుందంటూ పలువురు అభిప్రాయపడుతున్నారు.


కేసులో చిక్కిన కోతులు



నిండుకుండలా హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు, మత్తడి పారుతున్న..

ఎల్లమ్మ చెరువు మత్తడి దూకే..

హుస్నాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్‌లో అతిపెద్దదైన హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు ఇటీవల కురిసిన వర్షానికి నిండుకుండలా మారగా బుధవారం నుంచి చెరువు మత్తడి దూకుతుంది. జనగామ, గౌరవెల్లి వాగుల నుంచి గత కొన్ని రోజులుగా భారీ వరద చేరుతుంది. 16 ఫీట్ల సామర్థ్యం ఉన్న చెరువు పూర్తిగా నిండిపోయి అలుగు పారుతుంది. ఎల్లమ్మ చెరువుకు రెండు వేల ఎకరాలకు పైగా ఆయకట్టు ఉంది. చెరువు నిండటం వల్ల రెండు మూడు సంవత్సరాల వరకు సాగునీటి సమస్య ఉండక పోవడంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పేదల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

● రాష్ట్ర ఎస్సీఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

మిరుదొడ్డి, సెప్టెంబరు24 (ఆంధ్రజ్యోతి): పేదల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్దను చూపిస్తుందని రాష్ట్ర ఎస్సీఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. బుధవారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం భూంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ్ నారిసశక్త్ అభియాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని డీఎంహెచ్‌ఓ ధన్‌రాజ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. మహిళల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని స్వస్థ నారి సశక్తి అభియాన్ కార్యక్రమాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేయడం హర్షణీయమని తెలిపారు. అనంతరం రోగులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరోగ్య శిబిరాన్ని మహిళలు, గర్భిణులు, కిశోర బాలికలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈకార్యక్రమంలో మహిళలు భారీగా పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ మల్లికార్జున్‌రెడ్డి, ఎంపీడీఓ జహీరోద్దీన్, ఎంఈఓ అంజయ్య, నాయకులు బైరెడ్డి, రవి, జన్నారెడ్డి, దుబ్బరాజం తదితరులున్నారు.

మహిళా చట్టాలపై అవగాహన

కొమురవెల్లి, సెప్టెంబరు24 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లన్న ఆలయం వద్ద భక్తులకు, స్థానిక ప్రజలకు బుధవారం ఎస్పై రాజుగౌడ్,షీటీమ్ పోలీసుల ఆధ్వర్యంలో మహిళా చట్టాలపై,షీటీమ్ పనితీరుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై రాజుగౌడ్ మాట్లాడుతూ.. అపరిచిత వ్యక్తులను నమ్మి మోసపోవద్దన్నారు. దేవస్థానం పరిధిలో గదులు కిరాయికి ఇచ్చేవారు జాగ్రత్తగా ఉండాలని గదులు కిరాయికి ఇచ్చే ముందు వారి అడ్రస్ గుర్తింపు కార్డులను పరిశీలించాలన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

హుస్నాబాద్‌రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మహ్మదాపూర్‌లో తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడినట్టు గ్రామస్తులు తెలిపారు. మహ్మదాపూర్ గ్రామానికి చెందిన తడిసిన బాపురెడ్డి తల్లి ఇటీవల మరణించగా ఇల్లు వదిలిపెట్టి వేరే ఒక ఇంట్లో కిరాయికి ఉంటున్నారు. మంగళవారం సాయంత్రంఇంటి వద్దకు వచ్చి చూడగా ఇంటి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా ఇంట్లో దాచిపెట్టిన మూడు తులాల బంగారు ఆభరణాలు అపహరించినట్టు తెలిపారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు క్లూస్ టీంతో దర్యాప్తు చేపట్టారు.

ప్రకృతిని పూజించే గొప్ప పండుగ బతుకమ్మ


మహిళలకు చీరలు అందిస్తున్న చైర్ పర్సన్ కడవేర్గు మంజుల రాజనర్సు

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 24వ వార్డులోని మహిళా సమైక్య భవనం వద్ద నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో మున్సిపల్ చైర్ పర్సన్ కడవేర్గు మంజులరాజనర్సు పాల్గొన్నారు. మహిళలతో కలిసి స్వయంగా బతుకమ్మను పేర్చి బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ కడవేర్గు మంజుల రాజనర్సు మాట్లాడుతూ ప్రపంచంలో ప్రకృతిని పూజిస్తూ కొలిచే గొప్ప పండుగ బతుకమ్మ అని అన్నారు. పూలను దేవతగా కొలిచే గొప్ప సంప్రదాయం తెలంగాణ సొంతమన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలి సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో ప్రపంచానికి చాటేలా బతుకమ్మ పండుగ ఘనంగా నిర్వహించుకున్నామని గుర్తు చేశారు. బీఆర్ఎస్ పార్టీ హయాంలో బతుకమ్మ పండుగ సందర్భంగా రాష్ట్రంలో మహిళలకు బతుకమ్మ చీరల పంపిణీ చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేయడంలో విఫలం అయ్యిందని మండిపడ్డారు. ఈ సందర్భంగా వార్డులోని ప్రతి మహిళకు బతుకమ్మ పండుగ కానుకగా సొంత డబ్బులతో కొనుగోలు చేసిన చీరలను మహిళలకు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ కడవేర్గు రాజనర్సు, వార్డు ఆర్పీలు, ప్రజా ప్రతినిధులు,పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి చేయూత


బాధిత కుటుంబానికి బియ్యం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చిన్నకోడూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శంకరాయకుంట గ్రామానికి చెందిన మాకు నర్సయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ మండల ప్రధాన కార్యదర్శి ఎర్ర సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ మండలాధ్యక్షుడు బంక చిరంజీవి యాదవ్‌తో కలిసి బుధవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం 50 కేజీల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్ యాదవ్, రాజేందర్, కరుణాకర్, యాదగిరి, పోచమల్లు, ఎల్లం, దేవయ్య, పోచయ్య కనకరాజు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 23మందికి జరిమానా

గజ్వేల్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్‌లో 23మందికి జరిమానా విధిస్తూ గజ్వేల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ స్వాతిగౌడ్ తీర్పు వెలువరించారు. . గజ్వేల్ పట్టణంలోని ఆయా చౌరస్తాలో ఇటీవల జరిపిన వాహన తనిఖీల్లో 23మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ బ్రీత్ అనలైజర్ టెస్టులో పట్టుబడ్డారని గజ్వేల్ ట్రాఫిక్ సీఐ ఎం. మురళి తెలిపారు. వారిని బుధవారం కోర్టులో హాజరుపరుచగా, రూ.35వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు.

పారిశుధ్య కార్మికుల వేతనాలు పెంచాలి

● టీపీటీఎఫ్ అక్బర్‌పేట - భూంపల్లి మండల అధ్యక్షుడు శ్రీనివాస్

మిరుదొడ్డి,సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పారిశుధ్య కార్మికులకు గౌరవవేతనం చెల్లించాలని టీపీటీఎఫ్ అక్బర్‌పేట-భూంపల్లి మండల అధ్యక్షుడు శ్రీనివాస్ కోరారు. బుధవారం అక్బర్‌పేటలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం గ్రామాల్లో పనిచేస్తున్న పంచాయతీ కార్మికులకు వేతనాలను చెల్లించాలని, లేనియెడల పండుగపూట వస్త్ర ఉపాధిని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికులకు వేతనాలను చెల్లించి ఆదుకోవాలని కోరారు.

29న పెద్ద బతుకమ్మ

హుస్నాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ పట్టణంలో ఈ నెల 29వ తేదీన సద్దుల బతుకమ్మను నిర్వహించాలని పురోహితులు అభిప్రాయపడ్డారు. బుధవారం సాయంత్రం వలబురు మాజీ ప్రజాప్రతినిధులు కలిసి చర్చించారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం 30వ తేదీ సద్దుల బతుకమ్మ ఉండగా బతుకమ్మ ప్రారంభమైన సోమవారం నుంచి 9 రోజులు అవుతుందని పురోహితులు అనిల్ శర్మ, పవన్ శర్మలు పేర్కొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాల్లో నిజామాబాద్ ఎమ్మెల్యే

కొండపాక/ కొమురవెల్లి,సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జున స్వామిని బుధవారం నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే సూర్యనారాయణ ధన్‌పాల్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కొండపాక: మర్పడగ క్షేత్రాన్ని ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా బుధవారం రాత్రి సందర్శించారు. శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా జరుగుతున్న ఉత్సవాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా క్షేత్ర నిర్వాహకులు డాక్టర్ చెప్పెల హరినాథ్ శర్మ సత్కరించారు.

పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరించిన చిత్ర నిర్మాణ కమిటీ

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కుతున్న సినిమా నిర్మాణ కమిటీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. బుధవారం సిద్దిపేటలో చిత్ర దర్శకుడు సేనాపతి, సినిమా నిర్మాణ కమిటీ జిల్లా చైర్మన్ సింగోజు మురళీకృష్ణ ఆచార్యులతో కలిసి సినిమా నిర్మాణ కమిటీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దర్శకుడు సేనాపతి మాట్లాడుతూ జనం కోసం ప్రాణాలిచ్చిన పోరాట యోధులు, మహనీయుల్లో దొడ్డి కొమురయ్య ఒకరని అటువంటి మహనీయుడి జీవిత చరిత్రను సినిమా రూపంలో తెరకెక్కిస్తున్నామన్నారు. ఈ సినిమాకు జనమే నిర్మాతలుగా మారి ప్రతి జిల్లా నుంచి 30 మందిని సహ నిర్మాతలుగా తీసుకొని కమిటీ వేసి సినిమా నిర్మిస్తున్నామని తెలిపారు.

దుర్గాదేవి కుంకుమార్చనకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

దౌల్తాబాద్, సెప్టెంబరు (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముబారస్‌పూర్ గ్రామంలో దుర్గాదేవి అమ్మవారి కుంకుమార్చన మహోత్సవానికి దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డిని దుర్గా భవాని సభ్యులు కలిసి ఆహ్వానం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో ప్రతి ఒక్కరి ఇళ్లలో శాంతి సౌభాగ్యం నెలకొనాలని ఆకాంక్షించారు. అనంతరం వెంకటమ్మ కుంట మరమత్తులకు చేపట్టాలని తెలపగా వెంటనే ఇరిగేషన్ అధికారులకు ఫోన్ చేసి మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక నియోజకవర్గ సమన్వయకర్త రణం శ్రీనివాస్ గౌడ్, నాయకులు లక్ష్మణ్, రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన యూనివర్సిటీలో బతుకమ్మ సంబరాలు

ములుగు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉద్యాన విశ్వవిద్యాలయంలో బతుకమ్మ పండుగ పురస్కరించుకొని మహిళా అధికారులు సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. బుధవారం తెలంగాణ వ్యవసాయ కమిషన్ గౌరవ సభ్యురాలు మరికంటి భవాని రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు. విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ డి. రాజి రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా ఉద్యోగులు, విద్యార్థినులను ఉద్దేశించి శ్రీమతి భవాని రెడ్డి మాట్లాడారు. బతుకమ్మ తెలంగాణ సాంస్కృతిక వైభవానికి, సంప్రదాయానికి, మహిళా సాధికారతకు ప్రతీక అని ఆమె అన్నారు. హైదరాబాద్‌లోని ఎల్.బి. స్టేడియంలో జరగబోయే చారిత్రాత్మక కార్యక్రమంలో పదివేల మంది మహిళలతో 51 అడుగుల ఎత్తైన బతుకమ్మను తయారు చేసి, గిన్నిస్ వరల్డ్ రికార్డు నెలకొల్పేందుకు చేస్తున్న ప్రయత్నంలో ఎస్.కె.ఎల్.టి.జి.హెచ్.యూ ఉద్యోగులు, విద్యార్థులు చురుగ్గా పాల్గొనాలని ఆమె పిలుపునిచ్చారు. చివరిగా, మహిళా ఉద్యోగులు, విద్యార్థులు, యూనివర్సిటీ అధికారులు ఉత్సాహంగా బతుకమ్మలను నిమజ్జనం చేసి, సాంప్రదాయ పాటలు పాడుతూ, సంప్రదాయ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమం తెలంగాణ గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబిస్తూ, క్యాంపస్‌లో పండుగగా ఘనంగా నిర్వహించారు.


యూనివర్సిటీలో బతుకమ్మ మహిళా అధికారులు

సాదాబైనామా నోటీసుల ప్రక్రియను పరిశీలించిన అదనపు కలెక్టర్

చేర్యాల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): చేర్యాల తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం సిద్దిపేట అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ సందర్శించారు. భూభారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తుల పురోగతి, సాదాబైనామా నోటీసుల జారీ ప్రక్రియను పరిశీలించారు. త్వరితగతిన దరఖాస్తుల పరిశీలన పూర్తిచేసి రైతు సమస్యలు పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. ఈసందర్భంగా తహసీల్దారు దిలీప్‌నాయక్, ఆర్‌ఐ రాజేందర్‌రెడ్డి ఉన్నారు.

క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి

జగదేవ్‌పూర్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో మెదులుతూ చక్కగా విద్యను అభ్యసించాలని జగదేవ్‌పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ విజయ్ కుమార్ అన్నారు. బుధవారం కళాశాలలో ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ విజయ్ కుమార్ మాట్లాడారు. విద్యార్థులు పాఠ్యపుస్తకాలలో తెలియని విషయాలను అధ్యాపకుల వద్ద తెలుసుకొని ఇంటర్‌లో మంచి మార్కులు సాధించాలని అన్నారు. అనంతరం జగదేవపూర్ మాజీ సర్పంచ్ చిలువేరి మహేందర్ విద్యార్థులకు 20వేల విలువ చేసే స్పోర్ట్స్ డ్రెస్సులు అందజేశారు.

అనాథ పిల్లలకు చేయూతనందిస్తాం

● మాజీ జెడ్పీటీసీ ఎంబరి రాంచంద్రం

జగదేవ్‌పూర్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): అనాథ పిల్లలకు సేవ చేయడంలో సంతృప్తి కలుగుతుందని మాజీ జెడ్పీటీసీ రామచంద్రం పేర్కొన్నారు. దసరా పండుగ సందర్భంగా జగదేవపూర్ మండల పరిధిలోని అలిరాజపేటలో గల ఎస్‌వీ రోస్ సంస్థలో అనాథ బాలబాలికలకు బతుకమ్మ దసరా సందర్భంగా సొంత ఖర్చులతో మాజీ జెడ్పీటీసీ ఎంబరి రాములందరు దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 17 సంవత్సరాలుగా సంస్థ ద్వారా వికాస అనాథ బాలబాలికలకు దుస్తులను అందజేస్తున్నామన్నారు. అనాథ పిల్లలకు సేవ చేయడంతో ఎంతో సంతోషంగా ఉంటున్నారు. పిల్లలు కష్టపడి చదివి ఉద్యోగాలు సాధించాలని సూచించారు. భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకుని సంస్థకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు.

ఇందిరమ్మతో 'ఉపాధి'

(5వ పేజీ తరువాయి)

పొందుతారు. అనుమతులు పొందిన జాబితాను మండలాల వారీగా గృహనిర్మాణ శాఖ అధికారులకు అందిస్తారు. ఒకసారి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకం కింద మంజూరైన లబ్ధిదారులను ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా జరిగే వేరే పనులకు అవకాశం ఉండదు.

ఒక ఆర్థిక సంవత్సరంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఒక కుటుంబానికి నిర్దేశించిన 100 రోజుల పనిదినాలలో గరిష్ఠంగా 90 రోజుల పనిదినాలను గృహ నిర్మాణానికి కేటాయిస్తారు. ఒకవేళ ఈ సంవత్సరంలో ఒక కుటుంబానికి కేటాయించిన 100 రోజుల పనిదినాలు మించిపోయిన సందర్భాల్లో, ఎక్కువైన పనిదినాలను మరుసటి ఆర్థిక సంవత్సరంలో వేతనం చెల్లించే చెల్లింపులు చేస్తారు. ఒక కుటుంబం ఈ ఆర్థిక సంవత్సరంలో కుటుంబ సభ్యులందరూ కలిసి ఇందిరమ్మ ఇల్లు రావడంలో 80 రోజులు ఉపాధి పని పూర్తి చేస్తే, ఆ కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు ప్రస్తుతం మంజూరై ఉంటే, వచ్చే ఆర్థిక సంవత్సరంలో అవకాశం కల్పిస్తారు. అధికారులకు అందించిన మార్గదర్శకాల ప్రకారం కుటుంబంలో ఒక్కరికంటే ఎక్కువ మందికి జాబ్‌కార్డులు ఉంటే వారికి పనిదినాలను కేటాయిస్తారు. లబ్ధిదారునికి జారీ చేసిన మస్టర్లను పని పూర్తి చేసిన తర్వాత సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శి ధృవీకరణ చేస్తూ గృహనిర్మాణ శాఖ అధికారులకు అందజేస్తారు. అంటే ఒక ఇంట్లో ముగ్గురికి జాబ్ కార్డు ఉంటే ఒకరికి 30 రోజుల పనిదినాలుగా లెక్కిస్తారు. 32 మార్గదర్శకాలకు అనుగుణంగా సామాజిక తనిఖీల ద్వారా ఎలాంటి అవకతవకలు జరగకుండా ప్రభుత్వం ఈ మార్గదర్శకాలను విడుదల చేసింది.

సాగు వివరాల నమోదు తప్పనిసరి

దౌల్తాబాద్, /జగదేవ్ పూర్ సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు సాగుచేసిన పంటల వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సిద్దిపేట జిల్లా వ్యవసాయ అధికారి స్వరూపరాణి అన్నారు. జగదేవ పూర్ మండలంలోని తీగుల్ గ్రామంలో పత్తి, వరి పంటలను క్షేత్ర స్థాయిలో ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో పంటల సాగు వివరాలు నమోదు ప్రక్రియ వేగవంతంగా జరుగుతుందని, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు క్రాప్ సర్వేలో నిమగ్నమయ్యారని చెప్పారు. సర్వే ముగియగానే ఏఈ వోలు సంబంధిత జాబితాను గ్రామ పంచాయతీల్లో ప్రదర్శిస్తారని, అభ్యంతరాలుంటే రైతులు తెలియజేయాలని సూచించారు. క్రాప్ బుకింగ్ చేయని రైతులకు కొనుగోలు ప్రయోజనాలు వర్తించవని అన్నారు. మొక్కజొన్న, పప్పు ధాన్యాల లాంటి కోతలు పూర్తయిన పంటలు కూడా రైతులు పంట నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వసంతరావు, ఏఈఓ సాయి ప్రసన్న మరియు రైతులు పాల్గొన్నారు.


జగదేవ్ పూర్ మండలం తీగుల్‌లో పంటల నమోదును పరిశీలిస్తున్న డీఏవో స్వరూపరాణి

దౌల్తాబాద్: రైతులంతా తమ పంటల వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని దౌల్తాబాద్ ఏఓ పూజ పిలుపునిచ్చారు. మండలంలోని దీపలాపూర్ గ్రామంలో పంటలను పరిశీలించి డిజిటల్ యాప్ లో పంటలను నమోదు చేయించారు.





సమాజసేవకు ఎన్ఎస్ఎస్ ఎంతో ఉపయోగకరం


ఎన్ఎస్ఎస్ ఆకృతిలో విద్యార్థినులు

హుస్నాబాద్/ములుగు/సిద్దిపేట కల్చరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట, హుస్నాబాద్, ములుగులో బుధవారం ఎన్ఎస్ఎస్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మోటివేషనల్ స్పీకర్ భగవాన్ రెడ్డి మాట్లాడుతూ యువత దేశాభివృద్ధిలో పాలుపంచుకోవడానికి సమాజసేవ చేయడానికి ఎన్ఎస్ఎస్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు దేశంలో ఎలాంటి విపత్కర పరిస్థితి వచ్చిన ఎదుర్కొంటూ నలుగురికి సహాయం చేసే విధంగా ఉంటారని విద్యార్థులు తల్లిదండ్రులకు ఆదర్శంగా ఉంటూ అనుకూలంగా వారికి గొప్ప పేరు తీసుకువచ్చే విధంగా తయారవ్వాలని సూచించారు.

ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులను పాఠ్యాంశాలతో పాటు సామాజిక సేవలో ప్రోత్సహించడమే జాతీయ సేవా పథకం లక్ష్యమని కాళోజీ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ నందకుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ములుగు మండల పరిధిలోని క్రీడాసాగర్‌లోని హంస మెడికల్ కాలేజీలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విపత్తుల నిర్వహణలో ఎన్ఎస్ఎస్ సాహస కృత్యాలు ప్రశంసనీయమని కొనియాడారు. ప్రధాని నరేంద్ర మోదీ సామాజిక సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తూ స్వచ్ఛభారత్, సేవ్ నీరు పొదుపు వంటి కార్యక్రమాలు చేపడుతూ యువతను ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు.

హుస్నాబాద్‌ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాలల్లో బుధవారం ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థినులు ఎన్ఎస్ ఆకృతిలో ప్రదర్శన ఇచ్చారు.

సంఘాల ఏర్పాటుతోనే ప్రభుత్వ సంక్షేమ పథకాలు

● బ్యాంకు లింకేజీ ప్రాజెక్ట్ జిల్లా మేనేజర్ పీజీఎన్ ప్రకాశ్


బీజేపీ కార్యాలయంలో సీసీలతో మాట్లాడుతున్న బ్యాంక్ లింకేజీ ప్రాజెక్ట్ జిల్లా మేనేజర్ ప్రకాశ్

మద్దూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మహిళలు అధిక వడ్డీలకు అప్పులు తీసుకుని ఇబ్బందులు పడకుండా నూతన సంఘాలు ఏర్పాటుకు కృషి చేసి బ్యాంకు లింకేజీ చేయించడం ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు వడ్డీలేని రుణాలు అందేలా చూడాలన్నట్టు బ్యాంకు లింకేజీ ప్రాజెక్ట్ జిల్లా మేనేజర్ పీజీఎన్ ప్రకాశ్ తెలిపారు. బుధవారం మద్దూరు మండల కేంద్రంలోని జాగృతి కార్యాలయంలో ఏపీఎం ఖాతా ప్రకాశ అధ్యక్షతన కమ్యూనిటీ ఆర్గనైజర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లోని సంఘాలలోని సభ్యులు ప్రైవేటుగా ఫైనాన్స్‌లో గాని మైక్రో ఫైనాన్స్‌లో గాని అప్పులు తీసుకుని ఇబ్బందులు పడకుండా ఉండేందుకే వంద శాతం మహిళా సంఘాల సభ్యులకు వడ్డీలేని రుణాలు అందించి లక్ష్యంగా ఆర్థికంగా ముందుకెళుతున్నట్టు తెలిపారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో అన్ని సంఘాలకు స్పెషల్ డ్రైవ్ ద్వారా మానిటరింగ్ చేస్తున్నట్టు తెలిపారు. దివ్యాంగులకు సంఘాలుగా ఏర్పాటు చేసుకునేలా చూసి బ్యాంకులో అప్పు ఇస్తూ వారికి కూడా వడ్డీలేని రుణాలు, రాయితీలు, సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని తెలిపారు. 60 సంవత్సరాల పైబడిఉన్న మహిళల్ని సంఘాలలో నుంచి తీసేయడం జరిగిందన్నారు.